క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

రాయదుర్గంటౌన్: జిల్లా స్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో అండర్–17 హ్యాండ్‌బాల్ లో పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 29 నుంచి అక్టోబర్ 2 వరకూ గుంటూరులో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం జయప్రద తెలిపారు. హ్యాండ్‌బాల్‌లో ప్రతిభ చూపిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఎ.నందిని, హేమలత, కె.నందినిని మంగళవారం హెచ్‌ఎం, ఉపాధ్యాయులతోపాటు తోటి విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో పీడీలు మల్లమ్మ, భాగ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణతో బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న సీఐ లక్ష్మణ్

రాయదుర్గంటౌన్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, మంచి నడవడికతోనే బంగారు భవిష్యత్‌కు బాటలు పడుతాయని రాయదుర్గం యూపీఎస్ సీఐ లక్ష్మణ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వీరేష్ అధ్యక్షతన క్రమశిక్షణ, ర్యాగింగ్, సూసైడ్ రహిత భారత్ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ క్రమశిక్షణ లేకపోతే జీవితంలో ఏదీ సాధించలేమన్నారు. ర్యాగింగ్ పేరిట తోటి విద్యార్థులను వేధించడం నేరమన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా యువత ధైర్యంగా ముందుకు సాగి సమస్యలను పరిష్కరించుకోవాలే గాని సూసైడ్ లాంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. అన్నింటికీ చదువు ముఖ్యమని, విద్యతో ఉన్నతంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సన్మానం

కుందుర్పి: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పని చేసి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన 15 మంది సిబ్బందిని స్థానిక వైద్యులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో కార్యక్రమం ఏర్పాటు చేసి బదిలీ అయిన సిబ్బంది విజయభాస్కర్ రెడ్డి,సుధాకర్, నిర్మల, శ్రీనివాసులు, రంగస్వామి, అలివేలమ్మ తదితర 15 మంది సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు అనూష, నారాయణస్వామి, ల్యాబ్ టెక్నీషియన్ మధుబాబు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యం పెంపొందించాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంఓ మాధవరెడ్డి

కూడేరు: విద్యార్థుల స్థాయికి తగ్గట్టు విద్యాబోధన చేసి వారిలో విద్యా సమర్థ్యాన్ని పెంపొందించాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంఓ మాధవరెడ్డి సూచించారు. మంగళవారం కూడేరు, కరుట్లపల్లి, జల్లిపల్లి హైస్కూల్స్ కాంప్లెక్స్ స్థాయిలో ఆత్మకూరు, గార్లదిన్నె, కూడేరు మండలాలకు చెందిన బయాలజీ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కూడేరులో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన పిల్లలను గుర్తించి, వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు ఆదిలక్ష్మి, రమణ, శివ పాల్గొన్నారు.

స్వచ్ఛ రాయదుర్గం సాధిద్దాం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప

రాయదుర్గంటౌన్: స్వచ్ఛ రాయదుర్గం నిర్మాణానికి ప్రతిఒక్కరూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛ భారత్, స్వచ్ఛ రాయదుర్గం లక్ష్యాన్ని వివరించారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యపడుతుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, కౌన్సిలర్లు గోవిందరాజులు, గోరంట్ల ఉష, హెచ్‌ఎం ఆదినారాయణ, హెచ్‌ఎం ఆదినారాయణ, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, దివాకర్, ఇస్మాయిల్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర



కుందుర్పి: జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కణేకల్లు క్రాస్‌లో మారెమ్మదేవి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కుందుర్పి: మండలంలోని వివిధ గ్రామాల్లో మారెమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. మలయనూరు, నిజవల్లి, ఎర్రగుంట తదితర పంచాయతీల్లోని 10 గ్రామాల్లో ఉత్సవాలు చేపట్టారు. ఉదయం ఆయా గ్రామాల్లో మహిళలు బోనాలతో గ్రామోత్సవంగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శీగలపల్లిలో మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, ఎర్రగుంటలో సింగిల్‌విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రాము తదితరులు మారెమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేపట్టారు. కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కణేకల్లు: మండలంలోని కణేకల్లుక్రాస్‌లో మారెమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏడాదికోసారి గ్రామంలో జాతర జరుపుకోవడం ఆనవాయితీ. జాతరను పురస్కరించుకుని గ్రామదేవత మారెమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చన, మంగళారతి, మహా మంగళారతి, పంచామృతాభిషేకం పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

‘ఆరోగ్య శ్రీ’తో అందరికీ వైద్యం

- అసెంబ్లీలో విప్ కాపు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో వైద్య రంగం అద్భుత ప్రగతి సాధించిందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందేలా తీసుకొచ్చిన పలు సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ప్రశంసించారు. మంగళవారం శాసనసభ సమావేశాల్లో విప్ కాపు ఆరోగ్యశ్రీ పథకంపై మాట్లాడారు.. దేశంలోనే ప్రప్రథమంగా రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమల్లోకి తీసుకొచ్చారన్నారు. పేదలకు వరంగా మారిన ఈ పథకాన్ని టీడీపీ హయంలో అప్పటి సీఎం చంద్రబాబు నిర్లక్ష్యం చేవాడన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టగానే ఈ పథకానికి కొత్తరూపు తీసుకొచ్చారన్నారు. క్యాన్సర్ సహా 2,434 వైద్య సేవలను అనుసంధానం చేస్తూ ఉచితంగా సేవలు అందిస్తున్నన్న ఘనత సీఎం జగన్ కి దక్కుతుందన్నారు. ఆరోగ్య శ్రీ సేవలను విస్తరించడంలో భాగంగా పలు రాష్ట్రాలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను కూడా నెట్‌వర్క్ పరిధిలోకి తీసుకురావడం గొప్ప ఆలోచన అని ప్రశంసించారు. అగ్రరాజ్యం అమేరికాలో కూడా ఇలాంటి గొప్పపథకం లేదని గుర్తుచేశారు. అలాగే కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారిలో మరిన్ని ఆస్పత్రులకు ఆరోగ్య శ్రీ సేవలు విస్తరించేలా సంబంధిత మంత్రి దృష్టి సారించాలని విప్ కాపు విజ్ఞప్తి చేశారు. రాయదుర్గం నియోజకవర్గం కర్ణాటక రాష్ట్రానికి ఆనుకుని ఉందన్నారు. కొన్ని గ్రామాలు బళ్లారికి కేవలం 10 కిలోమీటర్లలోపే ఉన్నాయన్నారు. అనంతపురం 150 కిలోమీటర్ల దూరం ఉండడంతో ఎక్కువ మంది వైద్య చికిత్సల కోసం బళ్లారికే మొగ్గుచూపుతారన్నారు. ఆరోగ్య సేవలు బళ్లారిలో అందుబాటులోకి తీసుకొస్తే చాలా మందికి ప్రయోజనం చేకూర్చవచ్చని వివరించారు. అలాగే 108 వాహనం బళ్లారికి వెళ్లేందుకు డ్రైవర్లు మొండికేస్తున్నారన్నారు. అక్కడి దాక వాహనాలు వెళ్లివచ్చేలా మంత్రి అనుమతులు ఇవ్వాలన్నారు. రాయదుర్గంలో నిర్మాణంలో నున్న ఏరియా ఆస్పత్రి సకాలంలో పూర్తి చేసి, ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. విప్ విజ్ఞప్తిని పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

పంటల పరిశీలన

విడపనకల్లు: మండలంలోని కరకముక్కల, హావళిగి, చీకలగురికి గ్రామాల్లో వర్షాభావ పరిస్థితి వల్ల ఎండి పోయిన వేరుశనగ, కంది, ఆముదం పంటలను మంగళవారం మండల వ్యవసాయాధికారి పెన్నయ్య, ఆర్‌బీకే సిబ్బంది పరిశీలించారు. మండల వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోతున్న పంటలను పరిశీలించి నివేదికను జిల్లా అధికారులకు పంపుతామని ఏఓ తెలిపారు. ఖరీఫ్‌లో ఆముదం, కంది, వేరుశనగ తదితర పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఈనెల 30లోగా ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది సురేఖ, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

మండల కన్వీనర్ల నియామకం



ఏసీ ఎర్రిస్వామి ఉరవకొండ పట్టణ కన్వీనర్



సుంకన్న ఉరవకొండ రూరల్ కన్వీనర్



రామచంద్రారెడ్డి కూడేరు మండల కన్వీనర్



సోమశేఖర్‌రెడ్డి వజ్రకరూరు మండల కన్వీనర్



బోయ బసన్న విడపనకల్లు మండల కన్వీనర్



మచ్చన్న బెళుగుప్ప మండల కన్వీనర్

ఉరవకొండ: నియోజకవర్గంలోని అన్ని మండలాలకు వైఎస్సార్‌సీపీ నూతన కమిటీలను నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రకటించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఆయన పార్టీ మండల కన్వీనర్ల జాబితా విడుదల చేశారు. ఉరవకొండ పట్టణ కన్వీనర్‌గా మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, పార్టీ మండల రూరల్ కన్వీనర్‌గా చిన్నమూస్టురు సుంకన్న, పార్టీ మండల సమన్వయకర్తగా మూలగిరిపల్లి ఓబన్న, వజ్రకరూరు మండల కన్వీనర్‌గా బి.సోమశేఖర్‌రెడ్డి, విడపనకల్లు మండల కన్వీనర్‌గా బోయ బసన్న, బెళుగుప్ప మండల కన్వీనర్‌గా బోయ మచ్చన్న, కూడేరు మండల కన్వీనర్‌గా బైరెడ్డి రామచంద్రారెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ మండల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కమిటీల నియామకంలో సామాజిక న్యాయం పాటించామన్నారు. పార్టీ మండల కన్వీనర్లు సమన్వయంతో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పనిచేస్తూ పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.



ఓబన్న ఉరవకొండ సమన్వయకర్త

వైఎస్సార్ బీమాతో పేదలకు ధీమా



బాధిత కుటుం సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న విప్ సతీమణి కాపు భారతి

రాయదుర్గం/రూరల్: వైఎస్సార్ బీమా పథకంతో పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తూ, ఆర్థికంగా ఆదుకుంటున్నారని రెడ్‌క్రాస్ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. రాయదుర్గం వైస్ ఎంపీపీ కాశీపురం సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఆ కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎంపీపీ విద్యావతి, పార్టీ ముఖ్య నాయకులు బోర్‌వెల్ నాగిరెడ్డి, శివారెడ్డితో కలసి మంగళవారం విప్ కార్యాలయం వద్ద ఆమె అందజేశారు. ఆమె మాట్లాడుతూ వైస్ ఎంపీపీ మరణ వార్త జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. బీమా పంపిణీలో సాంకేతిక చిక్కులు ఎదురైనా విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అయ్యప్ప, జలంధర్‌నాయుడు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత

విడపనకల్లు: మండల కేంద్రంలో బోయ గౌరమ్మకు మంగళవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.పది వేల నగదును పంచాయతీ కార్యదర్శి బాషా, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు సుంకన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కురుబ గిరిబాబు, యువ నాయకుడు దేశాయ్ సిద్దార్ధ అందజేశారు. మూడు రోజుల కిందట బోయ నాగన్న చనిపోవడంతో తక్షణ సాయం మృతుడి భార్యకు అందజేశారు. మిగతా నగదు నామినీ ఖాతాలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు సౌమ్య, వెల్ఫేర్ అసిస్టెంట్, కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఐరన్ వంతెన



బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ శివారులో హెచ్చెల్సీ ప్రధాన కాలువపై ఉన్న ఐరన్ వంతెన మంగళవారం తెల్లవారుజామున కుప్పకూలింది. దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. 2020లో హెచ్చెల్సీ ప్రధాన కాలువపై ఉన్న వంతెన కూలిపోయింది. హెచ్చెల్సీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఏడాది తర్వాత 2021లో రైతులు, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సాయంతో చందాలు వేసుకుని రూ. 3 లక్షలకు పైగా ఖర్చు చేసి ఐరన్ వంతెన నిర్మించుకున్నారు. ఇది కూడా కూలడంతో పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోయారు. ప్రస్తుతం కాలువలో నీరు ప్రవహిస్తుండడంతో ఏం చేయలేకపోతున్నామని, కిలోమీటర్ దూరంలో ఉన్న పొలాల్లోకి వెళ్లేందుకు 20 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తుందని రైతు లు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా కూలిన ఐరన్ వంతెనను హెచ్చెల్సీ డీఈఈ మద్దిలేటి, జేఈ అలాఫ్ పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని డీఈఈ తెలిపారు.

అధికారులు రాని సమావేశం ఎందుకు?



సమావేశం బహిష్కరిస్తున్నట్లు ప్రకటిస్తున్న కో ఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీ, సర్పంచులు

రాయదుర్గం రూరల్: ప్రగతి నివేదికలతో హాజరు కావాల్సిన అధికారులు రాని సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నట్లు అని కో ఆప్షన్ సభ్యుడు దిలావర్ బాషాతో పాటు ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓ కొండయ్యను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. 11 గంటలకు ఎంపీపీ విద్యావతి, వైస్ ఎంపీపీ శాంతాబాయి వేదికపై ఆసీనులయ్యారు. ఎంపీటీసీ, సర్పంచ్ లు హాజరయ్యారు. 18 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా, మధ్యాహ్నం 12 గంటలైనా ఎంపీడీఓ కొండయ్య, ఏఓ చిక్కణ్ణ, ఈఓపీఆర్డీ రంగనాయకులు, హౌసింగ్ ఏఈ అనిల్ కుమార్ , ఒకరిద్దరు పంచాయతీ కార్యదర్శులు తప్ప ఎవరూ హాజరు కాకపోవడంతో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి రాని అధికారులపై ఉన్నతాధికారులకు తెలియజేసి, చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని ప్రకటించి, బయటకు వెళ్లి పోయారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సురేష్ , అరుణ్‌కుమార్, రాజు, శివప్ప , సర్పంచులు రాధమ్మ, భారతి, దురుగమ్మ, విశ్వనాథ్, ఎర్రిస్వామి రెడ్డి , శివారెడ్డి, రాయంపల్లి రామాంజనేయులు, కెంచానపల్లి బుజ్జి పాల్గొన్నారు.

మెరుగైన పశు వైద్య సేవలందించండి

ఉరవకొండ: గ్రామాల్లో పశువైద్య సేవలు మెరుగుపరచాలని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ సూచించారు. మంగళవారం ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డివిజన్ పరిధిలో పశు వైద్యాధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన వైఎస్సాఆర్ పశు బీమా పథకంపై పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పశువులకు అవసరమైయ్యే మందులు, వ్యాక్సిన్లను ఆయా పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం లంపీ చర్మవ్యాధి టీకాలను పాడి రైతులకు ఉచితంగా అందిస్తుందన్నారు. అక్టోబర్ 5న అనంతపురంలో జరిగే (ఎన్ఎల్ఎం) నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ సభకు ప్రతి మండలం నుంచి 20– 30 మంది పాడి రైతులు తరలివెళ్లేలా చూడాలన్నారు.అసిస్టెంట్ డైరెక్టర్ కాంతమ్మ, పశువైద్యాధికారులు శ్రీవిద్య, నరేష్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

పంట సంజీవని పరికరాలపై పీడీ ఆరా



రైతులతో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఫిరోజ్‌ఖాన్

గుమ్మఘట్ట: వర్షాధారం కింద సాగు చేసిన పంటలు ఎండిపోకుండా కాపాడుకోవడానికి పంట సంజీవని పథకం కింద ఇచ్చిన పరికరాలను తిరిగివ్వాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఫిరోజ్‌ఖాన్ సూచించారు. మండలంలోని సిరిగెదొడ్డి, గొల్లపల్లి గ్రామాల్లో రైతుల వద్ద ఉన్న పరికరాలను ఏడీఏ లక్ష్మానాయక్, మండల వ్యవసాయాధికారి నిర్మల్ కుమార్‌తో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. అలాగే రైతుల సమాచారం సేకరించారు.

ప్రతి ఇంటా వైద్య పరీక్షలు నిర్వహించాలి



కూడేరులో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా క్షయ నివారణ అధికారి అనుపమ జేమ్స్



గుమ్మఘట్ట మండలం కలుగోడులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కూడేరు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా ప్రతి ఇంటా వైద్య పరీక్షలు చేపట్టి ఆరోగ్య సమస్యలను గుర్తించి యాప్‌లో నమోదు చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ వైద్య సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేపై ఆమె సమీక్షించారు. అక్టోబర్ 3 నుంచి మండలంలోని సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఇంటింటా సర్వేను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగభూషణ రెడ్డి, డాక్టర్లు సరిత, లక్ష్మీనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు , వలంటీర్లు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ నరసింహమూర్తి, పీహెచ్‌సీ వైద్యులు రమేష్, బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని కలుగోడు,గోనబావి, తాళ్లకెర గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు వేర్వేరుగా పరిశీలించారు. వారు మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య సేవలందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సెప్టెంబర్ 30న గోనబావిలో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం: మండలంలోని కన్నేపల్లి సచివాలయాన్ని ఎంపీడీఓ దాసా నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ దాసానాయక్

‘మిలాదున్ నబీ’ జయప్రదం చేయండి

రాయదుర్గంటౌన్: ఈ నెల 28న మిలాదున్నబీ పర్వదినాన్ని (దైవ ప్రవక్త మొహమ్మద్ జన్మదినం) పురస్కరించుకుని పట్టణంలో చేపట్టనున్న ర్యాలీని ముస్లింలు జయప్రదం చేయాలని గౌసేఆజం దర్గా మసీదు కమిటీ నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు న్యాయవాది అబ్దుల్ వహాబ్, చమ్మా అస్లాం, అబు బక్కర్ మాట్లాడుతూ మక్కా , మదీన మసీదు నమూనాలతో దర్గా మసీదు వద్ద గురువారం ఉదయం 9 గంటల నుంచి ర్యాలీ ప్రారంభమై లక్ష్మీబజార్, కణేకల్లు రోడ్డు మీదుగా మళ్లీ మసీదుకు చేరుకుంటుందన్నారు. అలాగే బుధవారం రాత్రి ఇషా నమాజ్ అనంతరం దర్గా మసీదులో ప్రవక్త జన్మదినంపై మురాదాబాద్(యూపీ) నుంచి విచ్చేసిన మౌలానా నయూముద్దీన్ రజ్వీచే ఆధ్యాత్మిక ప్రసంగం కార్యక్రమం ఉంటుందన్నారు. ముస్లింలు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

హరేసముద్రం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రం గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని గ్రామస్తులు కోరారు. మండల కేంద్రం నుంచి గ్రామం ఆరు కిలో మీటర్ల దూరంలో ఉందని, ఇక్కడి నుంచి ఉన్నత పాఠశాలకు నడిచి వెళ్లాల్సి వస్తుందని విద్యార్థులు వాపోయారు. గతంలో కళ్యాణదుర్గం బస్సును బళ్లారికి నడిపేవారని, ఆ సర్వీసును రద్దు చేయడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. గ్రామం నుంచి రోజూ 70–80 మంది వరకు విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి వచ్చేందుకు 12 కిలోమీటర్లు నడవాల్సి వస్తోందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి హరేసముద్రం గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరారు.

భూ సర్వే పరిశీలన

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, బెస్తరపల్లి, నిజవల్లి పంచాయతీల్లో జగనన్న శాశ్వత భూహక్కు పథకం కింద చేపడుతున్న సర్వేను తహసీల్దార్ విజయకుమారి, డీటీ కుళ్లాయప్ప సోమవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో 30 శాతం సర్వే పూర్తయిందని, అక్టోబర్ నెలాఖరుకు సర్వే పూర్తి చేసి రైతులకు శాశ్వత భూహక్కు కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఎస్.మల్లాపురం రెవెన్యూ గ్రామంలో సర్వే పూర్తి చేసి 80 మంది రైతులకు శాశ్వత భూహక్కు భూరక్ష పథకం కింద పట్టాలు అందజేశామన్నారు. రైతులు సహకరిస్తే సర్వే త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.



రాయదుర్గంటౌన్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బేడ బుడగ జంగం సభ్యులు



వజ్రకరూరు: పీసీ ప్యాపిలిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

థ్యాంక్యూ సీఎం..

రాయదుర్గంటౌన్: బేడ బుడగ జంగం వర్గాన్ని మళ్లీ షెడ్యూల్ జాబితాలో చేర్చి వారికి న్యాయం చేయాలని కేంద్రానికి సిఫార్సు చేస్తూ ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల రాయదుర్గం బేడ బుడగ జంగం పోరాట సాధన సమితి హర్షం వ్యక్తం చేసింది. జేసీ శర్మ నివేదికను ఆమోదించి తీర్మానం చేసిందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, బేడ బుడగ జంగం రాష్ట్ర సాధన సమితి అధ్యక్షుడు ఎలమర్తి మధుకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం పట్టణంలోని వాల్మీకినగర్‌లో బేడ బుడగ జంగం సాధన సమితి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంతోషం వ్యక్తం చేశారు. సమితి అధ్యక్షుడు నాగయ్య మాట్లాడుతూ బేడ బుడగ జంగం సామాజిక వర్గానికి కుల ధృవీకరణ పత్రాలు లేక పిల్లలు చదువులు, సంక్షేమానికి దూరమవుతున్నారన్నారు. ఎస్సీ సర్టిఫికెట్లు లేక ఉపాధి కోల్పోతున్నామన్నారు. ఇలాంటి సమయంలో సమస్యను ప్రభుత్వం గుర్తించి ఎస్సీ జాబితాలో చేర్చేలా తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి విజ్ఞప్తి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు జమ్మన్న, పెద్ద బాలయ్య, రామాంజి, మారేష్, శంకర్ తదితులు పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉన్నారు

వజ్రకరూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని వైస్ ఎంపీపీ సుంకమ్మ, సర్పంచు జ్యోతిబాయి అన్నారు. మంగళవారం మండలంలోని పీసీ.ప్యాపిలిలో నూతన పింఛన్లు మంజూరైన సందర్భంగా సంబరాలు ని ర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పింఛన్‌దారులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తిప్పయ్య, ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు కిష్టప్ప, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చంద్రానాయక్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు రమేష్, మాజీ సర్పంచు ఎర్రిస్వామి, యువజన విభాగం ఉపాధ్యక్షుడు ప్యాపిలి వీరా, మైనార్టీ సెల్ కార్యదర్శి మాబూసాబ్, సచివాలయ కన్వీనర్ సత్యనారాయణ, కిసాన్ సెల్ కార్యదర్శి భీమా, పింఛన్‌దారులు పాల్గొన్నారు.